## క్లుప్తంగా

### నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

నరసరావుపేట: పురపాలక పరిధిలోని కొన్ని వార్డులకు శనివారం ఉదయం పూట మంచి నీటి సరఫరా అంతరాయం కలుగుతుందని కమిషనరు సి.రవిచంద్రారెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. పైపు లైన్లు మరమ్మతుల వలన 1, 34, 10, 11, 12, 13, 14, 17, 18, 19, 20 వార్డులతో పాటు బ్యాంక్ కాలనీ, విద్యానగర్, గ్యాస్‌గోడౌన్ పరిసరప్రాంతాలలో నీటి సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. సాయంత్రం యదావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. పురప్రజలు గమనించాలని ఆయన కోరారు.

### 19 నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19 సోమవారం నుంచి 177వ ఉచిత యోగ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగ శిక్షకులు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురూజీ శుక్రవారం తెలిపారు. శ్రీపట్టాభిరామ స్వామి దేవస్థానం ఆవరణలో ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు 28 రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. యోగ శిక్షణలో భాగంగా 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానం, ఆహార నియమాలు బోధించనున్నట్లు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో వత్తిడిని జయించేందుకు యోగా సహరిస్తుందన్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసేందుకు యోగా దోహదపడుతుందని తెలిపారు. వివరాలకు 9490846333, 9491665733 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### ఏంఎపం ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

నరసరావుపేట రూరల్: కేసానుపల్లిలోని మేదరమెట్ల అంజమ్మ మస్తానరావు ఫార్మసీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) ఏ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. నాక్ బృందం కళాశాలలో పర్యటించి విద్యా ప్రక్రియలు, ఫలితాలు, పాఠ్యప్రణాళిక, బోధన-అభ్యాసప్రక్రియలు, అధ్యాపకులు, పరిశోధన, మౌలిక సదుపాయాలు, అభ్యాస వనరులు, సంస్థ పాలన, ఆర్థిక శ్రేయస్సు, వాటి పనితీరును పరిశీలించి ఏ గ్రేడ్ ప్రకటించినట్లు వివరించారు. ఈ గుర్తింపు కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి దోహదపడుతుందని తెలిపారు.

### ప్రతిభావంతులకు నగదు పంపిణీ

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడి గ్రామం ఎస్‌పీఎస్ అండ్ జీవీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు పంపిణీ కార్యక్రమం జరిగింది, హైస్కూల్ హెచ్ బి వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు స్వర్గీయ లక్ష్మయ్య సీతారామమ్మ జ్ఞాపకార్థం 2024 పదో తరగతి పరీక్షల్లో 500 లకు పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1116 చొప్పున అందజేశారు. ప్రోత్సాహకాలు అందుకున్న వారిలో షబ్బీర్, ఆసిఫ్, వాసవి, మాబుబాషా, యశస్విని విద్యార్థులు ఉన్నారు.

### శీతల శవపేటిక వితరణ

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో సంగం డెయిరీ సేవా కమిటీ సభ్యుల సౌజన్యంలో శీతల శవపేటిక (ఏసీ బాక్సు)ను గ్రామస్తులకు శుక్రవారం అందుబాటులోకి తెచ్చినట్లు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా దేశ విదేశాల్లో కుటుంబ సభ్యులు ఉండటం వలన గ్రామంలో మృతి చెందిన వారికి శీతల శవపేటికను అవసరం నిమిత్తం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ మేనేజరు ముంద్రు ప్రభు, వెంకట్రావు, భరతుడు, కృష్ణారావు, నారాయణ, చెన్నంశెట్టి బ్రహ్మానందం, మద్దికుంట ఏడుకొండలు గ్రామస్తులు ఉన్నారు.

### రొంపిచర్ల ఎస్ఐగా అశోక్



రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా డి.అశోక్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుంటూరు జిల్లా తుళ్లూరు ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐగా పని చేసిన కె.పి. రవీంద్రబాబు బదిలీపై వెళ్లటంతో అశోక్‌ను నియమించారు. నూతన ఎస్ఐ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన అశోక్‌ను పోలీసులు అభినందించారు.

### అదుపు తప్పింది.. పల్టీ కొట్టింది!



నరసరావుపేట రూరల్: మండలంలోని బసికాపురం సమీపంలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. కోళ్ల దాణా లోడ్‌తో విశాఖపట్నం వెళ్తున్న లారీ గురువారం రాత్రి బసికాపురం సమీపంలో ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి లారీ అదుపుతప్పి రోడ్డు పక్కగా పల్టీ కొట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా ఉండటంతో ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం జరుగలేదు.

# ఒరిగిన స్తంభాలు నిలబెట్టరూ..!

- ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు

నాదెండ్ల: పనుల్లో నాణ్యత లోపించటంతో విద్యుత్ స్తంభాలు ఒరిగి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఎకనమిక్ డెవలప్‌మెంట్ స్కీంలో భాగంగా ఐదువేల జనాభా దాటిన గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంతో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. 2023లో ప్రారంభమైన పనులు చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాదెండ్ల మండలంలోని నాదెండ్ల, గణపవరం, సాతులూరు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, నూతనంగా 600 స్తంభాల ఏర్పాటు, త్రీఫేజ్ కరెంట్ సరఫరా దిశగా పనులు జరుగుతున్నాయి. మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోని శాంతినగర్‌లో పనులు పూర్తయ్యాయి. సుమారు రెండు నెలల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు నాణ్యతా లోపం కారణంగా ఓ పక్కకు పూర్తిగా ఒరిగాయి.

దీంతో సర్వీసు వైర్లు కూడా తెగే పరిస్థితి నెలకొంది. స్తంభం వేసే సమయంలో పునాది దగ్గర కాంక్రీటు వేయాల్సి ఉండగా మట్టిపోసి పూడ్చారు. దీంతో స్తంభం ఒరిగి ప్రమాదభరితంగా మారింది. ఎప్పుడు, ఏ సమయంలో స్తంభం ఒరిగి ఇళ్లమీద పడుతుందోనని, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గణపవరం శాంతినగర్‌లో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



నాణ్యతా లోపంతో విద్యుత్ స్తంభం పునాది

#### చర్యలు చేపడతాం

కాంట్రాక్టర్ ద్వారా తిరిగి స్తంభాన్ని యథాస్థానంలో పునరుద్ధరిస్తాం. ప్రమాదాలు జరగకుండా వెంటనే గ్రామంలో చర్యలు తీసుకుంటాం.

–అశోక్‌కుమార్, ఏడీఈ

# వరాలమ్మకు వందనం



గంటావారిపాలెంలో తిరుపతమ్మ తల్లి...



శావల్యాపురంలో కనకదుర్గమ్మ ఇలా..



సొలస శ్రీ భూ సమేత రంగనాయక స్వామి వారు..



గణపవరం కోదండ రామాలయంలో అమ్మవారు



రొంపిచర్లలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

శావల్యాపురం: శ్రావణమాసం సందర్భంగా రెండవ శుక్రవారం వరలక్ష్మి వేడుకలు మహిళలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. హిందూ సంప్రదాయంలో వరలక్ష్మి వేడుకలకు మంచి విశిష్టత ఉంది. మహిళలు 108 ప్రత్యేక పూలు, 21 రకాల పిండి వంటలు, వరలక్ష్మి అమ్మవారి సన్నిధిలో నైవిద్యంగా పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని, గంటావారిపాలెం, వేల్పూరు, కారుమంచి, శావల్యాపురం, పోట్లూరు, మతుకుమల్లి తదితర గ్రామాల్లో వరలక్ష్మి వ్రత వేడుకలు మహిళలు వైభవంగా నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**యడ్లపాడులో...**

యడ్లపాడు: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని సొలస గ్రామంలో శ్రీ భూ సమేత రంగనాయక స్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి రంగనాయక స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు జరిగాయి. అనంతరం సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రకాల ప్రసాద వినియోగం పంపిణీ చేశారు.

**నాదెండ్లలో....**

నాదెండ్ల: శ్రావణ మాసం రెండో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాలతో పాటూ గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. గణపవరంలోని కోదండ రామాలయంలో జరిగిన వరలక్ష్మీ వ్రతం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన అర్చకులు దర్శి అనిల్ కుమార్, ఉమామహేశ్వర శర్మలు అభిషేకాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలకు శుభప్రదమైన శ్రావణ మాసంలో ముత్తైదువులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గృహాలను పసుపు కుంకుమ, తోరణాలతో అలంకరించారు. వివాహిత స్త్రీలు వాయనాలిచ్చి పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన దాతలు సలిశం శ్రీనివాసరావు, జంపని సుబ్బారావు, నాగిశెట్టి సుబ్బారావు, వలేటి సురేష్, దేనువుకొండ సుధ, కందిమళ్ల శివనాగేశ్వరరావు దంపతుల ఆర్థికసాయంతో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కెల్లంపల్లి సుందరరావు, అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వర రావు, కార్యదర్శి కెల్లంపల్లి అచ్చయ్య, ఉపాధ్యక్షుడు సింగు సత్యనారాయణ, కోశాధికారి గాలి బుచ్చయ్య, సభ్యులు ఐతా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

**వినుకొండ గీతమ్స్‌లో..**

వినుకొండ(నూజెండ్ల): వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని స్థానిక సిద్ధార్థ నగర్‌లోని గీతమ్స్ హైస్కూల్‌లో వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గీతమ్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై మాట్లాడుతూ శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మి వ్రతంగా జరుపుకోవడం ఒక హిందూ ఆచారమన్నారు. వరలక్ష్మి వ్రత ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి వరలక్ష్మి అమ్మవారిని పూజించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శుభ విక్టోరియా, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రొంపిచర్లలో...**

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసి ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకం పూజలను నిర్వహించారు. శుక్రవారం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కుంకుమ పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, కొప్పుకోటయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో భక్తులు



వినుకొండలో వేడుకలు నిర్వహిస్తున్న గీతమ్స్ విద్యార్థులు

# యడ్లపాడులో ఉపాధి పనులపై ప్రజావేదిక

**అవకతవకలకు సంబంధించి రూ.2.20 లక్షలు రికవరీ చేయాలంటూ ఆదేశం**

యడ్లపాడు: మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై శుక్రవారం అధికారులు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పి ఝాన్సీ అధ్యక్షతన జిల్లా డ్వామా పీడీ జి జోసఫ్‌కుమార్ 16వ విడత జరిగిన సామాజిక తనిఖీల నివేదికను సమర్పించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి నిధులతో చేపట్టిన పనులు, నిధులు, సామాజిక తనిఖీల అంశాలపై చర్చించారు. ఉపాధి పథకం ద్వారా 1023 పనులు చేపట్టగా, ఇందుకోసం రూ. 7,81,32,879 నిధులు వెచ్చించారు. ఈ నిధుల్లో వేతనదారులకు కూలీ నిమిత్తం రూ.6,22,56,045, మెటీరియల్‌కు రూ.1,58,76,834 చెల్లించడం జరిగింది. ఉపాధినిధులతో పంట కాల్వలు, ఫీడర్ కాల్వలు, పండ్ల తోటల పెంపకం, చెరువుల పూడిక తీత పనులు, రూరల్ హౌసింగ్, డంపింగ్‌యార్డు షెడ్లు, సచివాలయాల నిర్మాణం, సీసీరోడ్లు, సీసీ డ్రైన్లు, గడ్డిపెంపకం వంటి పనులను చేశారు. పంచాయతీరాజ్, ఉపాధి హామీపథకం, పశుసంవర్ధక శాఖలు చేపట్టాయి. దీంతో మొత్తం 5831 కుటుంబ సభ్యులకు 2,,58,648 పనిదినాలు కల్పన జరిగింది.

**శాఖల వారీగా చేసిన పనులు, నిధుల వివరాలు...**

ఉపాధి హామీ పథకం కింద 1004 పనులకు రూ.6,56,49,575 నిధులు ఉపయోగించారు. వీటిలో కూలీలకు రూ.6,22,55,162 కాగా, మెటీరియల్ కింద రూ.33,94,413 ఖర్చు చేశారు. పంచాయతీరాజ్‌శాఖ 17 పనులు నిర్వహించింది. ఆయా పనులకు రూ.1,23,99,291 ఉపాధి నిధుల్ని వెచ్చించింది. ఇందులో కూలీలకు రూ.883, మెటీరియల్ నిమిత్తం రూ.1,23, 98,408 చెల్లించింది. ఆర్‌డబ్ల్యూఎస్ చేపట్టిన రెండు పనులకు రూ.84,013 ఖర్చుకాగా, ఈ మొత్తాన్ని కేవలం మెటీరియల్ ఖర్చు చేసింది. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ సుధాకర్, ఎంపీడీవో వై హనుమారెడ్డి, ఏవీఓ దాసరి విజయకుమారి, సామాజిక పెన్షన్ల ఏపీవో ఎస్ భరత్‌కుమార్, సామాజిక తనిఖీ విభాగం ఎస్ఆర్పీ జేఎస్ రాజు, డీఆర్పీలు, టీఏ మాధవి, ఏపీవోలు రామారావు, వెంకటేశ్వర్లు, కార్యదర్శులు, ఎఫ్ఏలు, మేట్లు పాల్గొన్నారు.



ప్రజావేదికకు హాజరైన ఎంపీపీ పి ఝాన్సీ, డ్వామా పీడీ జి జోసఫ్‌కుమార్

#### రూ.2.20 లక్షల రికవరీ చేస్తున్నాం

సామాజిక తనిఖీల బృందం క్షేత్రస్థాయి పరిశీలించిన తుది నివేదికను సమగ్రంగా పరిశీలించాం. ప్రధానంగా ఇకే కుటుంబానికి రెండేసి జాబ్‌కార్డులు ఉండటం, మస్టర్లలో దిద్దుబాట్లు ఉన్నాయి. ఉద్యానతోటల పెంపకం చేస్తున్న రైతులు వివిధ తెగుళ్ల రావడంతో కాలపరిమితి కాకుండానే పంట తొలగించడం, దింతెనపాడు, కొండవీడు, వంకాయలపాడు గ్రామాల్లో మృతి చెందిన ముగ్గురి పేరిటా ఒకరోజు కూలీ డబ్బులు చెల్లించడం జరిగింది. మొత్తం రూ.7.81 కోట్ల ఉపాధి పనుల్లో అవకతవకలను గుర్తించి రూ.2.20 లక్షలు తిరిగి చెల్లించాలని ఆదేశించాం. ఉద్యాన పంటల్ని తొలగించిన చోట తిరిగి మొక్కలు నాటించాలని లేకుండా వాటిని కూడా రికవరీ చేయాలని, డబల్‌జాబ్‌కార్డుల్లో ఒకదాన్ని తక్షణమే తొలగించాలని హెచ్చరించడం జరిగింది. ఇవే తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించాం.

జి. జోసఫ్‌కుమార్, డ్వామా పీడీ

# చిలకలూరిపేట జిల్లాలో ముందుండాలి

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు
- పురపాలక సంఘం ఆధ్వర్యంలో చెత్తబుట్టలు, తోపుడు బండ్లు పంపిణీ

చిలకలూరిపేటటౌన్: స్వచ్ఛసంకల్పంలో చిలకలూరిపేట నియోజకవర్గాన్ని ప్రథమస్థానంలో నిలపాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఇంటింటికీ చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన చెత్తబుట్టలు, వాహనాలను పురపాలక సంఘం ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తాగునీరు, వీధిదీపాలు, దోమల బెడదలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వీధుల్లో ఎక్కడా చెత్తకుప్పలు కనిపించకుండా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఇందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఇంటి నుంచి వెలువడే వ్యర్థాలను వీధులో పడేయరాదన్నారు. తడిపొడి చెత్తను ఇళ్లల్లోనే వేరుచేసి క్లాప్‌మిత్రలకు ఇచ్చే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం 25 తోపుడు బళ్లు, తడి,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు 450 చెత్తబుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్ గోవిందరావు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

**చిలకలూరిపేటలో అన్నక్యాంటీన్లు ప్రారంభం**

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్, అడ్డరోడ్ సెంటర్, గడియార స్తంభం సెంటర్లలోని 'అన్నా క్యాంటీన్ల'ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన జిల్లా కార్యదర్శి తోట రాజారమేష్ తో కలిసి ప్రారంభించారు. అధికారులు, నాయకులతో కలిసి అల్పాహారాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కడుపు నింపేందుకు అన్నక్యాంటీన్ ఏర్పాటు చేశామన్నారు.

ఉదయం టిఫెన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఉంటుందన్నారు. రూ.5కే అల్పాహారం, రూ.15 మూడు పూటల కడుపు నింపుకునేలా చేయడమే పథకం ఉద్దేశం అన్నారు. దాతలు ఇందుకు ముందుకు వస్తే మండలాల్లోనూ పథకం అమలుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్ఆర్‌టీ సెంటర్లోని అన్న క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

# అనారోగ్యంతో వీఆర్వో మృతి

**గ్రూప్–1 అధికారి కావాలనే లక్ష్యం నెరవేరకుండానే మృతి**



మృతుడు నూతక్కి నాగరాజు

నాదెండ్ల: అనారోగ్యంతో మండలంలోని సంకురాత్రిపాడు గ్రామ రెవెన్యూ అధికారి నూతక్కి నాగరాజు (44) గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ఆయన 2012లో వీఆర్వోగా ఉద్యోగంలో చేరారు. చందవరం, కనపర్రు గ్రామాల వీఆర్వోగా పనిచేశారు. ప్రస్తుతం సంకురాత్రిపాడు వీఆర్వోగా పనిచేస్తూ డిప్యూటేషన్‌పై తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. 2019లో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లారు. చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుటపడటంతో తిరిగి విధుల్లో చేరారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఆర్ఐ షేక్ రమీజా, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవిన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని నాగరాజు మృతదేహానికి నివాళులు అర్పించారు.

**లక్ష్యం నెరవేరకుండానే....**

నూతక్కి నాగరాజు గ్రూప్–1 అధికారిగా ఎంపిక కావాలనే లక్ష్యం పెట్టుకుని ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెస్సీ, బీఈడీ చదివిన నాగరాజు 2012లో గ్రూప్–4 రాసి ఉత్తీర్ణత సాధించి వీఆర్వో అయ్యారు. గ్రూప్–1 లక్ష్యం సాధించేందుకు పలుమార్లు ప్రవేశపరీక్షలకు హాజరయ్యారు. అయితే దురదృష్టవశాత్తు 2019లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లడం.. మళ్లీ అనారోగ్యం.. చివరకు లక్ష్యం నెరవేరకుండానే కన్నుమూశారు.

# ప్రతిభను వెలికితీయటం అభినందనీయం

**చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేత**

నరసరావుపేట: విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీ పరీక్షలను నిర్వహించి వారిని ప్రోత్సహించేందుకు బహుమతులను అందజేస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు అభినందనీయులని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ సూచనలు మేరకు 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిల్చిన వారికి గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఇవో మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ యుద్ధ, విపత్తుల సమయాలు, ప్రమాదాలలో గాయపడిన వారికి రక్తం అందించడం వంటి కార్యక్రమాలను ఎన్నో చేస్తుంటారని, అలాగే విద్యార్థులకు పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మునిసిపల్ బాలుర పాఠశాల, బాలికల పాఠశాల, బరంపేట ఎస్‌బీ రెడ్డి మున్సిపల్ హైస్కూల్, శంకర భారతీపురం జెడ్పీ హైస్కూలు, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హైస్కూలు, ప్రకాష్‌నగర్ తిలక్ మున్సిపల్ హైస్కూలు, కేజీబీవీ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు లైఫ్ సేవింగ్ స్కిల్స్ కూడా తెలుసుకోవటం చాలా అవసరమన్నారు. విద్యార్థులకు రెడ్‌క్రాస్ సొసైటీ తరపున ప్రతి పాఠశాల నుంచి 50 మందిని ఎంపిక చేసి వారికి ప్రథమ చికిత్సపై శిక్షణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలను అందజేస్తామని తెలిపారు. డిప్యూటీ డీఇవో ఏసు బాబు, రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ పీవీఎం.శరత్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాస గుప్తా, బత్తుల మురళి, డాక్టర్ సృజన, డాక్టర్ రెహమతుల్లా, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న వారితో డీఇవో వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

### వినుకొండ ఫొటోగ్రాఫర్స్‌కు పురస్కారాలు



వంగపల్లి బ్రహ్మం



సుబ్బారావు

వినుకొండ(నూజెండ్ల): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో పలువిభాగాల్లో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్ వంగపల్లి బ్రహ్మంకు బ్లాక్ అండ్ వైట్ సెక్షన్‌లో బెస్ట్ ఇమేజ్ అవార్డు పురస్కారం దక్కింది. అదేవిధంగా పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ కేసనపల్లి సుబ్బారావుకు కలర్ సెక్షన్‌లో అప్రిసియేషన్ అవార్డు దక్కింది. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఫొటోగ్రాఫర్లు పాల్గొనగా యూనివర్సిటీ ఉప కులపతి కె.గంగాధర్‌రావు విజేతలను ప్రకటించారు. ఈ నెల 19వ తేదీన యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో వీరు అవార్డు పురస్కారాలు అందుకోనున్నారు. విజేతలైన ఫొటోగ్రాఫర్లు బ్రహ్మం, సుబ్బారావులను అభినందించారు.

### డీఈఓకు ఉత్తమ సేవా పురస్కారం

నరసరావుపేట ఈస్ట్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విద్యారంగంలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా డీఈఓ వెంకటేశ్వర్లు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.



మంత్రి మనోహర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న డీఈఓ వెంకటేశ్వర్లు

### ఉత్తమ గ్రంథాలయ ఉద్యోగిగా గంటా శ్రీనివాసరావు

ఈపూరు: ఉత్తమ గ్రంథాలయ అధికారిగా మండల కేంద్రమైన ఈపూరులోని శాఖా గ్రంథాలయాధికారి గంటా శ్రీనివాసరావు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. గ్రంథాలయ సభ్యత్వం, గ్రంథాలయంలోని వివిధ కార్యక్రమాలను నిర్వహించినందుకు శ్రీనివాసరావును ఎంపిక చేసి ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ గుంటూరు కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ సిఫార్సు మేరకు ఎంపిక చేశారు. సందర్భంగా నరసరావుపేటలోని కేఎస్‌పీఆర్‌లో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జరిగిన వేడుకల్లో ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.



మంత్రి నాదెండ్ల చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

### కే-రిడ్జి స్కూల్‌కు ప్రథమ బహుమతి



నరసరావుపేట ఈస్ట్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన అమరావతి పాట నృత్య ప్రదర్శనకు ప్రథమ బహుమతి లభించిందని పాఠశాల ప్రిన్సిపల్ బర్నబాస్ శుక్రవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారని తెలిపారు. బహుమతి సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, స్కూల్ క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, ఉపాధ్యాయులు అభినందించారు.